భావతరంగిణి నవమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలో బహుమతి పొందిన కథ

# పరాకు పదనిస

"ఒరేయ్ నాగరాజా !"

పిలుపు జనసంద్రము హోరులో కలిసిపోయింది. హోటల్ మయూరిలోకి ఒంటరిగా ఎంటర్ కాబోతున్న నాగరాజు భుజమ్మీద బరువు పడింది. విదిలించుకుని వెనక్కి తిరిగాడు. దుబాయ్‌లో దుర్గమ్మ గుడి కన్పించినంత ఆశ్చర్యం... ఆనందం ... ఎదురుగా వెంకటేశము.

'ఓహూ ఆహా ! నువ్వా !' బిరడా విప్పిన సిలెండర్లోంచి గ్యాసులా మిత్రోత్సాహం ఉబికొచ్చింది. నోరు బార్లా తెరుచుకుంది. ఎయిర్ బ్యాగు ఎడమ భుజాని కప్పచెప్పి చేతులు ముందుకు చాచాడు.

'అవున్రా నాగూ... నేనే ! పిలిచినా పలకలేదు. ఏ లోకములున్నావురా ! భుజమ్మీద చెయ్యేస్తే .... ఇంత ఉలికిపాటా... '

'అది నీ చెయ్యా ! ఏదో ఐరన్‌రాడ్ అనుకున్నానురా ...!'

'జోకులు పీకుడొద్దుగానీ ... నాలుగైదేండ్ల నుంచి కనబడలేదు, వినబడలేదు.' చేతులందుకుని కరచాలనం చేశాడు.

అనూహ్యంగా అధికార పీఠాన్నధిష్టించిన అల్లునిలా మే మాసం ఎండ పొద్దున్నే చిటపటలాడ్తోంది.

చాలా రోజుల తర్వాత నిజామాబాదు నడిబజార్లో కలుసుకున్నారు స్నేహితులు. పాలబుగ్గల పసిడిప్రాయములో ఒకే క్లాసులో ఒకే బెంచిమీద అక్షరాలు దిద్దుకున్నారు. కాలేజీలో కలిసి అల్లరి చేశారు.

'అరె ... నడిబజార్ల గిదేం న్యూసెన్సువయా?' స్పీడుగా వస్తున్న స్కూటర్‌వాలా షడన్ బ్రేకు వేసి నిలదీశాడు. ఇద్దరూ అటూ ఇటూ చూసి నవ్వుకుని పక్కకు జరిగారు. చేతిలో చెయ్యేసుకుని హోటల్ మయూరిలో ప్రవేశించారు. టేబుల్ కెదురెదురుగా కూచున్నారు. కన్నతల్లి ప్రేమలా సీలింగ్ ఫ్యాన్ గాలి ఒంటికి చల్లగా తాకుతుంది. ఉల్లాసంగా ఉంది.

వచ్చేపోయేవారితో హోటల్ సందడిగా ఉంది. అయినా క్లీన్ అండ్ గ్రీన్‌కు కొదవలేదు. మసాలా దోసెల కార్డరిచ్చారు.

'ఇపుడు చెప్పురా నాగూ !' వెంకటేశము వెన్నుపూసలో హుషారు. 'హైటెక్ సిటీ హైద్రాబాదుల సాఫ్ట్‌వేర్ ఇంజనీరువైతివి. చేతి నిండా జీతం. మాచెల్లి ఒంటినిండా బంగారం... అదృష్టవంతుడివి గదూ!'

ఆ మాటలు వింటుంటే నాగరాజుకు రెక్కలు కట్టుకుని రామోజీ ఫిల్మ్‌సిటీలో విహరిస్తున్నట్టుంది.

'నీకేమైందిరా ! పుట్టి పెరిగిన కామారెడ్డి పట్నంలో వ్యాపారం చేస్తున్నావు. చేతినిండా సంపాదిస్తూ కాలుమీద కాలేసుక్కూచున్న నీకు హైదరాబాదీల బాదలేం తెలుసురా ? అంతా యాంత్రిక జీవితం. కృత్రిమ వాతావరణం.' పెదాలు చప్పరించాడు. 'నీ ఇల్లు మాత్రం పిల్లల్తోని స్వర్గధామమైంది గదా !' వేడిదోశె ముక్కకు కొబ్బరిచట్నీ దట్టిస్తూ మందహాసం చిందించాడు నాగరాజు.

'సరేగాని ... మా చెల్లి పూజలు ఫలించినయా !' అప్పుడే ఆన్ చేసిన కంప్యూటర్ తెరలాగైంది వెంకటేశం మొహం. 'శుభవార్త చెప్తున్నవా !' చేతిలోని దోశెముక్కలాగే పట్టుకుని సూటిగా అడిగాడు.

'ఫలించినట్టేరా !' మొహం నిండా సిగ్గుల ఛాయలు. 'నాల్గునెలల్లో తండ్రిని కాబోతున్నానురా !' నేల చూపులు.

'అం...టే !' ముందుకు వంగాడు. గదవబట్టి పైకి లేపాడు.

'ఈ సంగతి వింటే మీ చెల్లి ఎగిరి గంతేస్తుంది' విమానంలో వెళ్ళి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నంత సంతోషమైంది వెంకటేశంకు.

'అవున్రా ... పైవాడి పంచలో ఆలస్యముంది గాని అంధకారం లేదన్నమాట వాస్తవమైందిరా.'

కమ్మని టిఫిన్ అంటూ తియ్యని కబుర్లు చెప్పుకుంటున్నారు. పొగలు కక్కుతున్న చాయకప్పులు టేబుల్‌మీదకొచ్చినై...

'ఇంతకూ నిజామాబాదు కెప్పుడొచ్చినవు ? ఇప్పుడెటు వెల్తున్నవు ?' చాయ చప్పరిస్తూ అడిగాడు వెంకటేశం.

'నిన్ననే ఆఫీసు పనిమీదొచ్చిన. ఇప్పుడు బ్యాకటు పెవిలియన్. మరి నువ్వో? నాగరాజు కప్పు ఖాళీ అయింది.

'నేను గూడా నిన్ననే వచ్చిన వ్యాపారం పనిమీద. ఇప్పుడు తిరుగు ప్రయాణం కామారెడ్డికి' ఖాళీ కప్పు టేబుల్ మీదుంచాడు.

ఇద్దరూ కౌంటర్ ముందున్నారు. ఎలక్షన్లో ప్రత్యర్థుల్లా బిల్లు చెల్లించేందుకు పోటీ పడ్డారు. వెంకటేశం చేతిలో కొత్త వందనోటు ఫెళఫెళ లాడ్తోంది. నాగరాజు చేతిలోంచి చిల్లర అందుకుంటూ మేనేజరు ముసిముసిగా నవ్వాడు.

బజారులో జనసంచారం, వాహనాల రొద... ఇవేవీ పట్టించుకోకుండా కులాసాగా మాట్లాడుకుంటూ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా తానే టికెట్ కౌంటర్ క్యూలో నుంచున్నాడు వెంకటేశం.

'ఒకటి కామారెడ్డికి, ఇంకోటి హైదరాబాదుకు' రెండు టికెట్లు తానే తీసుకుని జేబులో వేసుకున్నాడు.

హైదరాబాదుకు ఎక్స్‌ప్రెస్ ట్రయినొచ్చేసింది. ఎక్కే దిగే ప్రయాణీకులకు తోడు చాయ్‌వాలా, పత్రికల కుర్రాళ్ల కేకలతో స్టేషన్ సమ్మక్క సారక్క జాతరలాగైంది. చకచకా ఎక్కేసి పక్కపక్కన కూచున్నారు.

చెడ్డీల వయసులో చిర్రాగోనె ఆట, పాంటు వయసులో క్రికెట్ ఆట, కాలేజీలో కుర్రచేష్టలు, దోస్తులతో బడాయి, లెక్చరర్లతో లడాయి, కబుర్లు ప్రవాహంలో దొర్లి పోతున్నాయి. కబుర్లు పూర్తి కాకముందే కామారెడ్డి స్టేషన్ వచ్చేసిందని కూతవేసి హెచ్చరించింది రైలు. ఆఖరు నిమిషం దాకా అదే ముచ్చట్లలో మునిగారు. ట్రెయిన్ మళ్ళీ కూతవేసి కదుల్తోంది. గబగబా దిగేశాడు వెంకటేశం.

నాగరాజు ఒంటరి వాడైపోయాడు. కాస్సేపు కిటికీలోంచి ప్రకృతి దృశ్యాలను పరిశీలించాడు. ముదిరిన ఎండ మొహాన్ని చురుక్కుమన్పించింది. కిటికీ మూసేశాడు. ట్రెయిన్ పరుగులు ఉయ్యాల లూపుతున్నాయి. చుకుబుకు రాగం జోలపాటైంది. నిద్ర ముంచుకొచ్చింది.

ట్రెయిన్ పరుగులు హైద్రాబాదు అంచుల్ని తాకబోతున్నాయి. నాగరాజును నిద్ర వదలలేదు. "టికెట్, టికెట్ ప్లీజ్" గుంపులోంచి గోవిందయ్యలా టి.సి. ప్రత్యక్ష మయ్యాడు. అందరి టికెట్లు చూస్తున్నాడు.

'టికెట్ ... మీ టికెట్ సార్ !' నాగరాజు ముందు చెయ్యి చాచాడు. నిద్ర వదల లేదు. గురక కూడా వినిపిస్తోంది.

'సార్ ... టికెట్ సార్' గొంతు పెంచి భుజం కుదిపాడు.

ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు.

ఎదురుగా సూటు, బూటు జంటిల్మేన్.

కలా... నిజమా... ఒళ్ళు గిల్లుకున్నాడు నిజమే ! వెర్రి చూపులు చూసి కింద నుంచి మీద్దాకా తడిమినై.

'టికెట్ ప్లీజ్' టి.సి. మందహాసము. బలిచక్రవర్తి ముందు వామనుడిలా చెయ్యి చాచాడు. 'టి .. టి... టిక్కెట్టా ...' నాలిక్కరుచుకుంటూ జేబులు తడుముకున్నాడు. ప్రయాణీకులంతా అటే చూస్తున్నారు.

'అవున్సార్ ! నేను టి.సి.ని మీ టిక్కెట్ చూపించండి.

'టిటి టిక్కెట్టా ... మొహం ముడుచుకుపోయి విచ్చుకుంది 'ఆఁ నా టిక్కెట్టు మా ఫ్రెండ్ దగ్గరుంది సార్ !'

'అలాగా !' టి.సి. చిరునవ్వు. ఆ చిరునవ్వులో ఇలాంటి వారినెందరినో చూశానులే అన్న భావముంది. 'సరే మీ ఫ్రెండును చూపించండి సార్ !'

'అతడు... అతడూ...' నెత్తిగోక్కున్నాడు. 'అతడు కామారెడ్డిలో దిగిపోయిండు సార్ !'

టి.సి. మొహం వైరస్ సోకిన కంప్యూటర్‌లా తయారయింది.

'అంటే తమరు టికెట్‌లెస్ పాసింజర్నమాట. ఇంతకూ నేనెట్లా కన్పిస్తున్నాను?'

'టి.సి. లాగ ... సార్ !'

'ఇంకా నయం మీ ఫ్రెండు కరీంనగర్లో దిగిపోయాడనలేదు. నా చెవిలో పువ్వేమన్నా కన్పిస్తుందా... లేక తమరే ఓ కాలీఫ్లవర్ పెడ్తున్నారా ?' కళ్ళల్లో కాఠిన్యం పొర.

'ఆహా... అది కాద్సార్ !' లోపలి ఆందోళన బయట పడకుండా జాగ్రత్త పడుతూ లేచి నుంచున్నాడు. 'నిజంగా మా ఫ్రెండు వెంకటేశం కామారెడ్డిలో దిగిపోయిండు సార్. మా ఇద్దరి టికెట్లు నిజామాబాదులో అతడే తీసుకున్నాడు సార్ !'

'మీ ఫ్రెండు వెంకటేశ్వరస్వామి అక్కడే దిగొచ్చు. కాని ఇప్పుడు తమరు టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మాట గూడా నిజమే గదా ?' వ్యంగాన్ని జోడించి లాపాయింటు లాగాడు. నాగరాజు బుర్రలో రైలు పరుగెడుతోంది. నుదిటి చెమటను చేతిగుడ్డతో అద్దుకుని పర్సు తీశాడు జేబులోంచి.

'టిక్కెట్టు పర్సులో ఉందని ముందే చెప్పొచ్చు గదా సార్ !'

'పర్సులో టిక్కెట్టు లేదు. ఎంత డబ్బు కట్టాలో చెప్పండి.'

'చదువుకున్న వాళ్ళు అన్నీ తెలిసిన వారే సర్కారుకు టోపీ పెట్టాలని ప్రయత్నిస్తే ఈ దేశమెట్లా బాగుపడ్తుందో !' టి.సి. నెత్తి గోక్కుని 'ట్రయిన్ స్టార్టింగ్ పాయింట్ నుండి హైద్రాబాదుకు టికెట్ చార్జి ప్లస్ ఫైన్ తియ్యండి డబ్బులు.' రసీదు బుక్కందుకున్నాడు.

'అయ్యోపాపం అంతడబ్బు లేకపోతే ఎట్లాసార్ ?' నుంచున్న పాసింజరు సానుభూతి.

'అంతడబ్బు లేకపోతే జైలు శిక్ష ఎంతనో పోలీసులు ... కోర్టు వాళ్లు చూసు కుంటారు.'

కోరలు పీకిన నాగుపాములాగయ్యాడు నాగరాజు. ఇంత బతుకు బతికి పోలీసులు.. జైలు దాకానా ! పర్సు విప్పుకుంది. 'సరే రాయండి రసీదు.' నోట్లు రెక్కలు విప్పుకుని టీసీ చేతిలో వాలినై.

తోటి ప్రయాణీకుల ముసిముసి నవ్వులు చూస్తుంటే తలదీసి మొలేసినట్టు అనిపించింది.

*(భావతరంగిణి మాస పత్రిక - జులై, 2008)*